# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శనివారం 7 జూన్ 2025 | HYDERABAD





## ఆ ప్లాట్లు కొనచ్చా?

అమ్మకానికి హౌసింగ్ బోర్డు స్థలాలు

11న కేపీహెచ్‌బీ కాలనీలో

18 ప్లాట్ల వేలం పాట

వివిధ అంశాలపై రాని స్పష్టత

అమ్మకానికి పెట్టిన

స్థలాలపై అనుమానాలెన్నో

ఆసక్తిగల వారికి సందేహాలు నివృత్తి

చేస్తేనే.. ప్లాట్ల అమ్మకాలు


>IVలో




చర్లపల్లి రైల్వే స్టేషన్ టెర్మినల్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం సందర్శించారు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేందుకు రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రైల్వే టెర్మినల్‌కు వచ్చ రహదారి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. -చర్లపల్లి, జూన్ 6



శుక్రవారం బేగంపేట ప్యాట్నీ నాలా ఆక్రమణలను కూల్చివేస్తున్న దృశ్యం



*హైదరాబాద్‌లో వానాకాలం నేపథ్యంలో హైడ్రా నాలాల ఆక్రమణలపై దృష్టి పెట్టింది. నగరంలోని నాలాల ఆక్రమణలను గుర్తించి వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టింది. రసూల్‌పురా నాలా వద్ద కబ్జాలను తొలగించడంతో పాటు పాట్నీ సెంటర్ వద్ద వాణిజ్య నిర్మాణాలను హైడ్రా సిబ్బంది కూల్చేశారు. నాలాల కబ్జాపై హైడ్రా అత్యంత పటిష్టంగా వ్యవహరిస్తుందని, అక్రమంగా నిర్మించిన వాణిజ్య భవనాలను ఎట్టి పరిస్థితుల్లో కూల్చేస్తామని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. పేదల నివాసాలకు సంబంధించిన అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.*

*- సిటీబ్యూరో/బేగంపేట*

# నాలాలపై ఆక్రమణలు 30 వేలు

## కచ్చితంగా ఆ నిర్మాణాలను తొలగిస్తాం

### నాలుగునెలల పాటు స్పెషల్ డ్రైవ్..హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి

**ప్రజావాణిలో** అందిన ఫిర్యాదుల ఆధారంగా జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్ట్ అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. కంటోన్మెంట్ సీఈవో మధుకర్ నాయక్ కూడా పాల్గొన్నారు. ఈ పర్యటనల్లో హస్మత్‌పేట, పికెట్ నాలాలను నిశితంగా పరిశీలించారు. ప్యాట్నీ వద్ద 17 మీటర్ల వెడల్పుతో ఉండాల్సిన నాలా దాదాపు 150 మీటర్ల పొడవునా కేవలం ఆరు నుంచి ఏడు మీటర్లకే కుంచించుకుపోయిందని గుర్తించారు. దీనివల్ల మహేంద్రహిల్స్, పికెట్, జేబీఎస్, బాలంరాయ్, విమాన్‌నగర్ వంటి ప్రాంతాలు ప్రతి వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నాయని స్థానికులు హైడ్రా కమిషనర్‌కు తెలిపారు. చీకోటి గార్డెన్స్, ప్రకాశ్‌నగర్ మెట్రోస్టేషన్ వద్ద కూడా ఇదే విధమైన పరిస్థితి ఉందంటూ స్థానికులు చెప్పారు. ఈ ప్రాంతంలో 6 మీటర్ల వెడల్పు ఉన్న వరద కాలువ కొన్నిచోట్ల 4.5 మీటర్ల మేర ఆక్రమణకు గురైందన, మరికొన్నిచోట్ల నాలాను ఇష్టానుసారం మళ్లించారని స్థానికులు ఫిర్యాదు చేశారు.
దీంతో ప్యాట్నీ వద్ద 70 అడుగుల విస్తీర్ణంలో ఉండాల్సిన


మిగతా IVవ పేజీలో




## 8 నుంచి చేప ప్రసాదం పంపిణీ

సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ)/అబిడ్స్: ఆస్తమా వ్యాధిగ్రస్తులకు నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈనెల 8, 9న చేప ప్రసాదం పంపిణీ చేయనున్నారు. ఈమేరకు వేలాది మంది వచ్చే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వివిధ రూట్ల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు టీజీఆర్టీసీ శుక్రవారం ప్రకటించింది. ముఖ్యమైన బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ఎయిర్ పోర్టు నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు బస్సులను 8వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నడపనున్నట్లు అధికారులు వెల్లడించారు. వాటిలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, కాచిగూడ రైల్వే స్టేషన్, చర్లపల్లి రైల్వే స్టేషన్‌తో పాటు జేబీఎస్, ఎంజీబీఎస్, ఈసీఐఎల్ ఎక్స్ రోడ్స్, శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వివిధ బస్ డిపోల నుంచి బస్సులను నడుపుతామని చెప్పారు. ఆయా రూట్లలో మొత్తం 60 బస్సులను అదనంగా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా ముఖ్యమైన ప్రాంతాల నుంచి మరో 80 బస్సులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కాగా, ఈ ఏడాది ఎగ్జిబిషన్ మైదానంలో చేప ప్రసాదం పంపిణీ కోసం 42 క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తెలిపారు.



## చికెన్ సెంటర్లు సీజ్

మేడ్చల్, జూన్ 6 : మేడ్చల్‌లో అపరిశుభ్ర వాతావరణంలో విక్రయాలు జరుపుతున్న చికెన్ సెంటర్లను మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. శుక్రవారం కమిషనర్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో చికెన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించారు. అపరిశుభ్ర వాతావరణంలో చికెన్‌ను విక్రయిస్తూ ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్న రెండు చికెన్ సెంటర్లను గుర్తించారు. రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న సుగుణ, అక్బర్ చికెన్ సెంటర్లను సీజ్ చేశారు. బస్టాండ్‌కు ఎదురుగా ఎస్ఎఫ్‌సీ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో పాడైన గుడ్లు, ఆహార పదార్థాలను వంటకాల తయారీ వినియోగిస్తున్నట్టు గుర్తించి, సీజ్ చేశారు.




మేడ్చల్‌లో చికెన్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి

# ఇచ్చే జీతంలోనూ కోతలా?

## జీవో 60కు తూట్లు పొడుస్తున్న వైనం

### సర్కారు దవాఖానల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాల్లో దోపిడీ

సిటీబ్యూరో, జూన్ 6,(నమస్తే తెలంగాణ): ప్రభుత్వాసుపత్రుల్లో విధులు నిర్వహించే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి చెల్లించే వేతనాల్లో కోతలు పెడుతున్నారు. చాలీచాలని వేతనాలతో జీవితాలను నెట్టుకొట్టుస్తున్న తరుణంలో, ఇచ్చే వేతనంలో కూడా కాంట్రాక్టర్లు కోతలు పెట్టడం మూలంగా కుటుంబాలను పోషించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు మూడేండ్ల కిందట వేసిన టెండర్ల గడువు ముగిసినా కూడా నేటికి కొత్త టెండర్ల ప్రకటన చేయకుండా టీఎస్ఎంఐడీసీ కాలయాపన చేస్తున్నది.

#### జీవో 60 ప్రకారం..

జీవో 60 ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు, వారికి రావాల్సిన బెనిఫిట్స్ అందించడం లేదు. 100 పడకలకు 45 మంది చొప్పున శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బందిని నియమిస్తారు. వీరికి చెల్లించే వేతనం సైతం పడకల సామర్థ్యం ఆధారంగానే నిర్ణయిస్తారు. గతంలో ప్రతి బెడ్‌కు నెలకు రూ.5000 చెల్లించేవారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు హరీశ్ రావు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే వారి సేవలను గుర్తించి రూ.5000 కు బదులు బెడ్‌కు రూ.7500 చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. వాటిని కొన్ని రోజులు సాఫీగా అమలు చేసినా కాంట్రాక్టర్లు దాన్ని విస్మరించారు. ప్రస్తుతం ఈ సిబ్బందికి చెల్లించే రూ.15,600 వేతనంలో కోతలు పెట్టి చివరికి రూ.11,600 చెల్లిస్తుండటం గమనార్హం. ఏజెన్సీలు సకాలంలో పీఎఫ్, ఈఎస్ఐలు చెల్లించకుండా సిబ్బంది వేతనాల్లో కటింగ్ పెట్టడంతో ఆ సిబ్బంది మదనపడుతున్నారు. ఆసుపత్రుల్లో ఏజెన్సీల గడువు పూర్తయి నెలలు గడుస్తున్నా కూడా టీఎస్ఎంఐడీసీ అధికారులు కొత్త టెండర్‌కు ప్రకటన జారీ చేయలేదు.




#### పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించకపోగా..

గ్రేటర్‌లో ఉన్న నిలోఫర్, ఉస్మానియా, గాంధీ, కింగ్ కోఠి జిల్లా, పేట్లబుర్జ్ ఆసుపత్రుల్లో సుమారు 2500 మంది సిబ్బంది శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాల్లో పనిచేస్తున్నారు. వీరంతా ఏజెన్సీ ద్వారా పొరుగు సేవల ప్రాతిపాదికన విధులు నిర్వహిస్తున్న మూలంగా వీళ్లందరి వేతనాలు సైతం ప్రతినెలా ఏజెన్సీనే చెల్లించాల్సి ఉంటుంది. కాగా, ఏజెన్సీలు సిబ్బందికి పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించకపోగా, ప్రతినెల ఇచ్చే వేతనంలో కూడా కోతలు పెడుతున్నారు.

#### కనీస వేతనం చెల్లించాలి

ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలి. కొత్త టెండర్లు పిలిచి సిబ్బందికి న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

**-నర్సింహా, మెడికల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ, ఏఐటీయూసీ**




## విశ్వశాంతి మహాశక్తిగా మహాగణపతి

ఈసారి 69 అడుగులతో మట్టి విగ్రహం ప్రతిష్ఠాపన

శుక్రవారం శోభాయమానంగా కర్ర పూజ క్రతువు

## ద్రోణి ప్రభావంతో..

సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో శుక్రవారం రాత్రి గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. చంపాపేట, బండ్లగూడ, ఖైరతాబాద్, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. ద్రోణి కొనసాగుతుండడం వల్ల రాగల 24 గంటల్లో గ్రేటర్‌లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. శుక్రవారం నగరంలో గరిష్ఠం 36.5, కనిష్ఠం 24.6 డిగ్రీలు, గాలిలో తేమ 41 శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.



బురఖా వేసుకొచ్చి..

## వృద్ధ దంపతుల దారుణ హత్య

### రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలో ఘటన

బండ్లగూడ, జూన్ 6:రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జన చైతన్యకాలనీలో వృద్ధ దంపతులు హత్యకు గురికావడం కలకలం సృష్టించింది. మసాజ్ పేరిట బురఖా వేసుకుని వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఈ దారుణానికి పాల్పడ్డట్టు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. రిడిల్స్‌కు చెందిన షేక్ అబ్దుల్లా, రిజ్వానా దంపతులు బుద్వేల్ లోని జనచైతన్య కాలనీలో నివాసముంటున్నారు. రిజ్వానా బ్యాంకు ఉద్యోగిగా పనిచేసి రిటైర్ కాగా, షేక్ అబ్దుల్లా ప్రైవేట్ కళాశాలలో హెచ్‌వోడీగా పని చేసి రిటైరయ్యారు. వారికి నలుగురు పిల్లలు. వారంతా విదేశాల్లో స్థిరపడ్డారు. గురువారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు బురఖా వేసుకుని వచ్చి వాచ్‌మెన్‌తో మాట్లాడారు. మసాజ్ చేయడానికి రమ్మన్నారని చెప్పారు. వాచ్‌మెన్ ఫోన్ చేసి ఓకే చెప్పడంతో వారిద్దరు పైకి వెళ్లారు. అందులో ఒకరు కేవలం ఐదు నిమిషాల్లోనే వెనక్కి వెళ్లిపోయారు. ఇంకొక వ్యక్తి 45 నిమిషాల పాటు లోపలే ఉన్నారు. శుక్రవారం ఉదయం వృద్ధ దంపతులు ఎంతకీ బయటకు రాకపోవడంతో వాచ్‌మెన్ అనుమానం వచ్చి లోపలికి చూసేసరికి రక్తపు మడుగులో పడి ఉన్నారు. బురఖా వేసుకుని వచ్చిన వాళ్లు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు డీసీపీ చింతమనేని శ్రీనివాస్ అనుమానం వ్యక్తం చేశారు. ఆ వ్యక్తులు ఎవరనేది ఆరా తీస్తున్నామన్నారు. హత్యకు దారి చేసిన కారణాలు తెలియ రాలేదన్నారు.

## మాగంటిని పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు

సిటీబ్యూరో/కొండాపూర్: తీవ్ర అస్వస్థతకు గురై గచ్చిబౌలిలోని ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను శుక్రవారం మంత్రి శ్రీధర్‌బాబు, మేయర్ గద్వాల విజయలక్ష్మి పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు. కాగా, మాగంటి ఆరోగ్య పరిస్థితి క్లిష్టంగా ఉండడంతో రెండు రోజులుగా వెంటిలెటర్‌పైనే చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి క్లిష్టంగానే ఉన్నట్లు దవాఖాన వర్గాలు స్పష్టం చేశాయి.

## ఆ డాక్యుమెంట్లు ఎక్కడకు వెళ్లాయ్?

నకిలీ పత్రాల తయారీ వ్యవహారంలో రాని స్పష్టత

కొనసాగుతున్న దర్యాప్తు.. పోలీసులు మూలాల వరకు వెళ్తారా? అనే సందేహాలు

ఇప్పటివరకు 16 మంది అరెస్టు

పరారీలో మరో ఇద్దరు మున్సిపల్ సిబ్బంది


>IIలో




## రేషన్..పరేషాన్

ప్రతిరోజూ లబ్ధిదారులకు రేషన్ బియ్యం కోసం అవస్థలు తప్పడం లేదు. శుక్రవారం మణికొండలోని ఓ రేషన్ దుకాణం వద్ద ప్రజల తిప్పలివి

## చంపారా.. చనిపోయాడా!

మరోసారి తెరపైకి ఆటోడ్రైవర్ ఇర్ఫాన్ మృతి ఘటన

పోలీసులు కొట్టడంతోనే మృతిచెందినట్లు బంధువుల ఆరోపణ

సుమోటోగా స్వీకరించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ


>IIలో


